
సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 28 । జూలై । 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,000,పశ్చిమ డెల్టాకు 1,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.



సింగిల్ విండోకు పచ్చజెండా?

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించ నున్నారు. వివాహ పురోహితుల కొత్త విధానాన్ని ఆమోదించే వీలుంది. - 8లో▸

హైపటైటిస్



సక్రమంగా లేని మన ఆహారపు అల వాట్లు ప్రాణాం తక వ్యాధు లకు కారణమ వుతాయి. పలు వురు మద్యం సేవిస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుం టారు. అటువంటి వారు లివర్ సమస్యల బారిన పడే అవకాశముంది. 8 లో

న్యూస్‌రీల్

రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్



రాజమహేంద్రవరం సిటీ: తెలంగాణలోని హసన్‌పర్తి - ఖాజీపేట రైల్వేట్రాక్‌పై నీరు చేయడంతో కొన్ని రైళ్లను రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యం లో కొన్ని రైళ్లను రాజమహేంద్రవరం మీదుగా మళ్లిస్తున్నారు. శుక్రవారం 12791, 12625, 03252, 22535 నంబర్లు గల రైళ్లను దారి మళ్లిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం రాజమ హేంద్రవరం రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

4,930 వీవీ ప్యాడ్స్ రాక

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన కేంద్రానికి 4,930 ఓటింగ్ వెరిఫికే షన్ ప్యాడ్స్ (వీవీ ప్యాడ్స్) చేరుకున్నాయని కలెక్టర్ మాధవీలత తెలిపారు. లాలాచెరువు సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్‌లో భద్రపర చిన వాటిని గురువారం జేసీ తేజ్ భరత్, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, ఇతర అధికారులతో కలిసి ఆమె పరి శీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల అనుబంధ యూనిట్లను అత్యంత కట్టుదిట్ట మైన భద్రత నడుమ భద్రపరిచామన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షం లో తనిఖీ చేసి, స్ట్రాంగ్‌రూమ్‌లో డిపాజిట్ చేశామన్నారు. నిరంతర పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

బంగారుకొండతో సత్ఫలితాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలో అధికారులు, ప్రజల భాగస్వామ్యం తో ప్రయోగాత్మకంగా చేపట్టిన బంగారుకొం డ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని కలె క్టర్ డా.కె.మాధవీలత చెప్పారు. స్థానిక ఐదు బళ్ల మార్కెట్ సెంటర్‌లో బుధవారం బంగా రుకొండ కార్యక్రమంలో భాగంగా తాను దత్తత తీసుకున్న రేలంగి ఇవాంశిక ఇంటికి ఆమె వెళ్లారు. ఆరోగ్య వివరాలను తెలుసు కున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సం పూర్ణ పోషణ కింద బలవర్ధకమైన ఆహా రాన్ని, బాలామృతం, కోడిగుడ్లను క్రమం తప్పకుండా బాలికకు అందిస్తున్నారన్నారు. దీంతో పాటు బంగారుకొండ కిట్ కూడా అం దిస్తున్నారన్నారు. ఇవాంశిక వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు, రక్త హీనత కలిగి ఉన్నట్లు గుర్తించామన్నారు. డాక్టర్ల సూచనలను కూడా అనుసరిస్తున్నామన్నారు. హిమోగ్లో బిన్ శాతం కూడా పెరిగిందన్నారు. జిల్లాలో 6 నెలల నుంచి ఆరేళ్ల లోపు 1293 మంది పిల్లలను గుర్తించామని కలెక్టరు తెలిపారు. ప్రతి బుధవారం బాలమిత్రలు ఈ చిన్నా రుల ఇంటికి వెళ్లి బంగారు కొండ కిట్ ద్వారా అందుతున్న ఆహార పదార్థాల, ఆరోగ్య వివ రాలు పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒక కిట్ చొప్పున ఆరు నెలలు పాటు అంద జేసి పర్యవేక్షిస్తారన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌వీ నరసమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

'నన్నయ'లో విద్యార్థులు ఆందోళన విరమణ

రాజానగరం: తమకు గతంలో ఇచ్చిన హామీ మేరకు 75 శాతం కాషన్ డిపాజిట్ తిరిగి చెల్లించాలంటూ నన్నయ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులు చేస్తున్న ఆందోళనను గురువారం సాయంత్రం విరమించారు. వీసీ ఆచార్య కె. పద్మరాజుతో బుధవారం వివిధ దఫాలుగా జరిగిన చర్చలు కొలిక్కి వచ్చాయి. వీసీ చాంబర్ వద్ద బుధవారం రాత్రి నుంచి వీరు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో గురు వారం మరోసారి ఆ విద్యార్థులతో ఉదయం నుండి నాలుగు దఫాలుగా వీసీ చర్చలు జరి పారు. ఎట్టకేలకు రూ.నాలుగు వేలు కాషన్ డిపాజిట్టును తిరిగి చెల్లించేందుకు అంగీ కారం కుదిరింది. దీంతో ఆందోళనను విర మిస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిలాల ఉపాధ్య క్షుడు డి. అశోక్‌కుమార్ తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ అమరావతి ఆధ్వ ర్యంలో 2023 – 24 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కల వారు ఈనెల 27 నుంచి వచ్చేనెల 31వ తేదీ లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్ స్కూ లు.గవ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసు కోవచ్చన్నారు.

ఉగ్ర గోదావరి

- ఎగువ ప్రాంత వర్షాలతో వరద ప్రవాహం
- భద్రాచలం వద్ద తగ్గుతూ.. పెరుగుతున్న ప్రభావం
- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- వరద నీటిలోనే లంక గ్రామాలు



ధవళేశ్వరం బ్యారేజ వద్ద వరద ఉధృతి

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. నిలకడగా సాగిన ప్రవాహం ఒక్కసా రిగా పెరిగింది. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో అంతకంతకూ పెరుగుతోంది. గురువారం రాత్రి భద్రాచలం వద్ద కాస్త తగ్గుముఖం పడుతోంది. రెండో ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. ఈ ప్రభావంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సాయంత్రం 6 గంటల సమయానికి కాటన్ బ్యారేజ్ వద్ద నీటి మట్టం 13.70 అడుగులకు చేరింది. 12,90,982 క్యూసెక్కుల మిగులు జలాలను 175 గేట్లు ఎత్తి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. 4,000 క్యూసెక్కులు డెల్టా కాలువలకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లో ఉండగా.. నీటి ఉధృతి మరింత పెరిగి బ్యారేజీ నీటి మట్టం 13.75 అడు గులకు చేరింది. ఫలితంగా ఇరిగేషన్ అధికారులు 6.30 గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ ప్రవాహం రేపటి వరకు కొనసాగే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు.

విపత్తుల శాఖ అప్రమత్తం

విపత్తుల శాఖ, జిల్లా అధికారులు అప్రమత్తమ య్యారు. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా అధికారులకు విపత్తుల శాఖ అప్రమత్తం చేస్తోంది. సహాయక చర్యల నిమిత్తం ఇప్పటికే కోనసీమ జిల్లాకు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను పంపింది. స్టేట్ కంట్రోల్ రూమ్‌లను సైతం సిద్ధం చేసింది. గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని సూచించింది.

నీటిలోనే లంకలు

- వశిష్ఠ గోదావరికి వరద ప్రవాహం పెరగడంతో లంక గ్రామాల పంటలు నీట మునిగాయి. పెరవ లి మండలం కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ఉమ్మిడివారిపాలెం, ముక్కా మల, ఖండవల్లి, మల్లేశ్వరం దిగువ లంకల్లో 800 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. వరద మరిం త పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తు న్నారు. శుక్రవారం ఉదయానికి పైలంకలు పూర్తిగా మునిగే అవకాశం ఉంది. కొబ్బరి, అరటి, కంద, వంగ, బెండ, బీర, ఆనప, చిక్కుడు, క్యాబే జీ, దొండపందిర్లు, పచ్చిమిరప తోటలు, గోం గూర, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతి కూర, పూలతోటలైన బంతి, చామంతి, గులాబీ, మల్లె, లిల్లీతోటలు మునిగిపోతాయని లంకరై తులు ఆందోళన చెందుతున్నారు.
- గోపాలపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంట చెరువులు పూర్తిగా నిండాయి. గోపాలపురం మండలం వెంకటాయపాలెం, చిట్యాల గ్రామాల్లో కొవ్వాడ కాలువ వరద నీరు పంట పొలాలను ముంచెత్తింది. వరి చేలు నీటమునిగాయి. దేవరపల్లి మండలం త్యాజంపూ డిలో ఎర్రకాలువ నీటి ప్రవాహానికి పంట పొలాలు నీట మునిగాయి. నల్లజర్ల మండలం తెలికిచర్ల, పోడవరం గ్రామాల్లోని కూరగాయల పాదులు వర్షాలకు దెబ్బతిన్నాయి.
- కొవ్వూరు, గోపాలపురం మండాలల్లో లోతట్టు ప్రాంతాలు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయి. తాళ్ల పూడి, చాగల్లు మండలాల్లోకి కొవ్వాడ కాలువ, రాళ్ల మడుగు కాలువ పరివాహక ప్రాంతాలు ముంపుతోనే ఉన్నాయి. యార్నగూడెంలో వర్షా లకు రోడ్డు దెబ్బతింటున్నాయి. చాగల్లు మం డలం చంద్రవరంలో వేముల కాలువ ప్రవాహ ఉధృతితో పంటలు నీట మునిగాయి.
- సీతానగరం మండలంలోని ములకల్లంక, బొబ్బి ల్లంక, నెత్తిపాడు, ఉండేశ్వరపురం గ్రామాలకు వదర పోటు తగిలింది. సుమారు 2 వేల ఎకరాలు వరి నీటి మునిగింది.
- కోరుకొండ మండలం బుచ్చెంపేట, గుమ్ములూరు, బూరుగుపూడి, మునగాల, శ్రీరం గపట్నం గ్రామాల్లో వరద నీరు చుట్టుముట్టింది. సుమారు 3 వేల ఎకరాల్లో పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. రెండు మండలాల పరి ధిలో సుమారు 5 వేల మంది రైతులకు నష్టం వాటిల్లనుంది. ఇప్పటికే 60 శాతం వరి నాట్లు పూర్తవడంతో పంట ఏమౌతుందోననే ఆందోళన రైతుల్లో నెలకొంది.

జిల్లా కలెక్టరేట్	8977935609
రాజమహేంద్రవరం ఆర్డీవో	0883-2442344
కొవ్వూరు ఆర్డీవో	9440295493

జిల్లా యంత్రాంగం అప్రమత్తం

రాజమహేంద్రవరం సిటీ: బ్యారేజి వద్ద వరద ఉధృతి తీవ్రతరమైన నేపథ్యంలో జిల్లా అధి కార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా, డివిజినల్, మండల స్థాయిలో కంట్రోల్ రూం లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. లంకల్లో ప్రజలను సుర క్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ఫీ ఫోటోల కోసం గోదావరి ఘాట్ల వద్దకు రావద్దని ప్రజలను కోరారు. గట్లు తెగే ప్రాం తాలను క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించి అధికారు లకు తెలియజేయాలన్నారు. అలాంటి చోట్ల ఇసుక బస్తాలు సిద్ధం చేయాలన్నారు. పునరా వాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన ఆహార పదార్థాలు, మందులు, బోట్లు అందుబాటులో ఉంచాలని, రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో బ్రహ్మపురి పీఎస్ ఎలిమెంటరీ స్కూల్, మసక పల్లి జిల్లాపరిషత్ స్కూల్, వాడపల్లి జెడ్పీ హైస్కూలు..ఎలిమెంటరీ స్కూళ్లలో ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు.



పేపర్రులో అరటి పంట నీటమునగడంతో గెలలను బయటకు తీసుకొస్తున్న రైతులు

టీడీపీతోనే నగరంలో అలజడి

- బ్లేడ్ బ్యాచ్, రౌడీలు, గూండాలను పోషిస్తున్నారు
- విలేకరుల సమావేశంలో ఎంపీ భరత్ రామ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీలోని కొందరు నాయ కుల వ్యవహార శైలే నగరంలో అలజడులకు కారణమ వుతోందని, రౌడీలు, గూండాలు, బ్లేడ్ బ్యాచ్‌ను వారే పెంచి పోషిస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. గురువారం నగరంలోని తిలక్ రోడ్డు గౌతమ్ యూరాలజీ హాస్పిటల్ వద్ద ఉన్న పార్టీ అర్బన్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లా డారు. చారిత్రక నగరంలో అసాంఘిక శక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వాటిని తరిమే యాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సిటీ ఎమ్మెల్యే హైదరాబాద్‌లో మకాం వేశారని, ఆమె స్థానంలో షాడో ఎమ్మెల్యేలుగా ఆమె భర్త, మామ పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. నగరం మరింత అభివృద్ధి సాధించాలంటే విద్యావంతులు, మేధావులు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. మణిపూర్ ఘటనపై పార్లమెంట్‌లో చర్చ జరగాల న్నదే వైఎస్సార్ సీపీ అభిప్రాయమని ఎంపీ భరత్ రామ్ అన్నారు. ఆ రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీయే అధికారంలో ఉన్నా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా అధికార యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఎక్కడ నిర్లక్ష్యం జరిగిందో బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వాలు సమాధానం చెప్పాలన్నారు.

నేడు అర్బన్ కార్యాలయం ప్రారంభం

తిలక్ రోడ్డులోని గౌతమ్ యూరాలజీ హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ అర్బన్ నియోజకవర్గ కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్ రామ్, బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు హాజరవుతారని సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు బాసటగా..

- విదేశీ విద్యాదీవెన రెండో విడత నిధుల విడుదల
- జిల్లాలో 12 మందికి రూ.1.37 కోట్ల లబ్ధి



నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎంపీ భరత్‌రామ్, రుడా చైర్‌పర్సన్ షర్మిలా రెడ్డి, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జగనన్న విదేశీ విద్యాదీవెన కింద జిల్లాలో 12 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు రెండో విడతగా రూ.1,37,09,253 రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వెలగపూడిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్ర మంలో కలెక్టర్ మాధవీలత, ఎంపీ మార్గాని భరత్ రామ్, రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి, జేసీ తేజ్ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల్లో ఇద్దరు ఎస్సీ, ఒక మైనారిటీ, ఇద్దరు బీసీ, ముగ్గురు ఈబీసీ, నలుగురు ఓసీ విద్యార్థులున్నా రన్నారు. వారు కోర్సు పూర్తి చేసుకునేలా నాలుగు వాయిదాల్లో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంద న్నారు. ఇమిగ్రేషన్ కార్డు (ఐ-94) పొందాక తొలి వాయిదా, మొదటి సెమిస్టర్ ఫలితాల తర్వాత రెండో వాయిదా, రెండో సెమిస్టర్ ఫలితాల తర్వాత మూడో వాయిదా, విజయవంతంగా 4వ సెమిస్టర్ పూర్తి చేసి మార్కులు ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాక చివరి వాయిదా చెల్లింపు జరుగుతుందన్నారు. జిల్లాకు చెం దిన విద్యార్థుల్లో ముగ్గురు యూఎస్‌ఏలో, ఏడుగురు యూకేలో, ఒకరు కెనడాలో, ఒకరు కజికిస్తాన్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 357 మంది విద్యార్థులకు రూ.45.53 కోట్లను ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి వారి తల్లుల ఖాతాలకు జమ చేస్తున్నార న్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు పూర్తి ఆర్థిక సాయంగా రూ.1.25 కోట్ల వరకూ, ఇతర విద్యార్థులకు రూ.1 కోటి వరకూ అందిస్తున్నార న్నారు. రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉన్నత విద్యను 50 దేశాల్లో 21 కోర్సులను చదువుకునే అవకాశాన్ని జగన్ ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైఎ స్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, డీఎ స్‌డబ్ల్యూఓ సందీప్, డీబీసీడబ్ల్యూఓ పీఎస్ రమేష్, ఏబీసీడబ్ల్యూఓ పి.రామకృష్ణ, ఎం.సుబ్బారావు, విద్యా ర్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

కోరిక నెరవేరింది



జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా మా అబ్బాయి నంబూరి శ్రీవర్మకు గతంలో రూ.9.25 లక్షలు వచ్చింది. ఇప్పుడు రెం డో విడత మంజూరైంది. విదేశాల్లో చదువు కోవాలనే మా అబ్బాయి కలను సీఎం జగన్ సాయంతో నెరవేరింది. ముఖ్యమంత్రికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. చదువును ప్రోత్సహిస్తున్న ఆయనకు ధన్యవాదాలు.

– నంబూరి సత్యనారాయణరాజు, వాణీ ఈశ్వరి

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా మా అబ్బాయి హర్షిత్ శ్రీవాత్సవ విదేశాల్లో చదువుకుంటున్నాడు. పేద విద్యార్థుల ఉన్నత చదువుకు సాయం చేస్తున్న ముఖ్యమం త్రి జగన్‌కు కృతజ్ఞతలు. విదేశాల్లో ఉన్నత చదువుల కలను తీర్చుతున్న ఆయనకు రుణపడి ఉంటాం.

– పోలిన వెంకట సత్యనారాయణ, స్వరూప

రూ.34 లక్షల లబ్ధి



నేను యూకేలో ఉన్నత విద్యను అ భ్యసి స్తున్నాను. మాది మధ్య తరగ తి కుటుం బం, అమ్మ గంగా రత్నం, నాన్న ఫణిరాజు శ్రీను. జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా నాకు సుమారు రూ. 34 లక్షలు లబ్ధి చేకూరింది. సెలవులు కావడంతో స్వస్థలానికి వచ్చాను. పేద వి ద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కృషి చేస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– కొండేటి సత్యసూర్య హేమంత్, రాజమహేంద్రవరం

రూ.2.05 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం

హోమ్ మంత్రి తానేటి వనిత



రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: డిస్ట్రిక్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో చాగల్లు,తాళ్లపూడి మండ లాల్లో రూ.2.05 కోట్లు నిధులతో సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేయనున్నట్లు రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత తెలిపారు. గురువారం పట్టణంలో క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు.ఈ నిధులతో రెండు మండలాల్లో 33 సిమెంట్లు రోడ్లు, 25 డ్రెయిన్లు నిర్మాణ పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.1.07 కోట్లతో చాగల్లు మండలం నందిగంపాడు,గౌరీపల్లి, ఉనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండ పాడు, మ ల్లవరం గ్రామాల్లో 33 రోడ్లు నిర్మాణం చేపడుతున్నా మన్నారు. నందిగం పాడు లో శ్మశానం వాటికలో షెడ్డు నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు. తాళ్లపూడి మండలంలో తాళ్లపూడి,కుక్కునూరు,ప్ర క్కిలంక,తిరుగుడుమెట్ట,పెద్దేవం, వేగేశ్వ రపురం,అ న్నదేవర పేట గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్ట నున్నట్లు తెలిపారు.వీటి నిమిత్తం రూ.98లక్షలు వెచ్చించనున్నట్లు మంత్రి వనిత తెలిపారు.చాగల్లు మండలంలో కలవలపల్లి,దారవరం,మల్లవరం, చాగల్లు,చంద్రవరం, ఉనగట్ల, గ్రామాలతో పాటు తాళ్లపూడి మండలంలో పోచవరం, వేగేశ్వరపురం, తాడిపూడి గ్రామాల్లో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టను న్నట్లు మంత్రి తెలిపారు.

అప్రమత్తమే డెంగీకి చికిత్స

- జిల్లాలో పెరుగుతున్న కేసుల సంఖ్య
- చర్యలు తీసకుంటున్న అధికారులు
- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన
- దోమలు దరిచేరని వాతావరణమే మందు



రాజమహేంద్రవరంలో డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వర్షాకాలం మొదలైంది. ఎక్కడ చూసినా నీటి గుంతలు, మురికి నీటి నిల్వలు. ఇదే వైరల్ జ్వరాలకు, దోమకాటు జ్వరాలకు అనుకూల సీజన్. అప్రమ త్తంగా లేకపోతే ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడతారు. ఇప్పటికే చాలా ఇళ్లలో జ్వరం, దగ్గు, జలుబు బాధితులుంటున్నారు. వర్షాల ఆగకుండా కురుస్తుండడంతో నేలంతా తడి తడిగా ఉంటోంది. దీనివల్ల వైరల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. నీటి నిల్వలు పేరుకుపోతుండడంతో దోమలు విజృ ంభిస్తాయి. అలసత్వం చూపితే డెంగీ జ్వరం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.


పెరుగుతున్న కేసులు

పూర్వపు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ప్రస్తుతానికి అధికారిక లెక్కల ప్రకారం ఈ సీజన్‌లో ఇప్పటివరకు 834 శాంపిల్స్‌ను సేకరించారు. రాజ మహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు నిర్వ హించారు. తూర్పు గోదావరి జిల్లాలో 27 కేసులు నమోదయ్యాయి. పొరుగున ఉన్న అల్లూరి జిల్లాలో ఎక్కువగా 46 కేసులు నమోదయ్యాయి. కోన సీమలో 10, కాకినాడ జిల్లాలో ఎనిమిది కేసులు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ సంఖ్య ఇంకా అధికంగా ఉంది. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు డెంగీ పేరిట రకరకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్లేట్‌లెట్ల బూచీ చూపి వ్యాపారం చేసుకుంటున్నారు. మరోపక్క ప్రభుత్వ వైద్యాధికారులు ఫీవర్ సర్వే ప్రారంభించారు. సచి వాలయ వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇం టింటా తిరుగుతున్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు.

డెంగీ లక్షణాలు..

- దోమ కుట్టిన 24 గంటల్లో విపరీతమైన తలనొప్పి వస్తుంది.
- జ్వర తీవ్రత పెరిగే కొద్దీ కళ్లు ఎర్రగా మారుతుంటాయి.
- కండరాల నొప్పి, కీళ్ల నొప్పి తీవ్రంగా ఉం టుంది.
- ఒళ్లంతా ఎర్రని దద్దుర్ల మాదిరిగా ఏర్పడ తాయి.
- వాంతులు అవుతాయి.
- రక్త పరీక్షల్లో డెంగీ హెమరోజిక్ ఫీవర్ వస్తుంది.
- ఇక చివరి దశ అంటే డెంగీ షాక్ సిండ్రోమ్.

గంబోషియా ఫిష్‌లను వదులుతున్నాం...




డెంగీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. లార్వాస్ సర్వే చేస్తున్నాం. గంబోషియా ఫిష్‌ను నీటి నిల్వలున్న ప్రాంతాల్లో వేస్తున్నాం. ఇండోర్ స్పేస్ స్ప్రే, ఫాగిం గ్ వంటివి చేస్తున్నాం. శుక్రవారం డ్రై డేగా ఇంటింటికీ తిరిగి దోమలు పెరగకుండా జాగ్రత్తలు చేపట్టేలా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. వలంటీర్లు, ఆశ వర్కర్ల ద్వారా పారిశుద్ధ్యంపై అవగా హన కల్పిస్తున్నాం. ప్రభుత్వాసుపత్రిలో మాక్ ఎలిజా టెస్ట్ అందుబాటులో ఉంది. కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల వారితో కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రణాళికలు సిద్ధం చేశాం...

– ఎ.వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ

వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయారంగేట్రం

వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్



సాక్షి, రాజమహేంద్రవరం: వైద్య రంగంలో ఉన్న తాను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తితో రాజకీయ రంగ ప్రవేశం చేసినట్లు వైఎస్సార్ సీపీ రాజమ హేంద్రవరం సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీని వాస్ తెలిపారు. గురువారం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో మాట్లాడారు. వైద్యుడిగా కొనసాగుతున్న తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చి ప్రజా చేయాలన్న సూచనతో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. తనను పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కం పూడి రాజా, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రోత్సహించి నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం నగర పార్టీలో వర్గ విభేదాల గురించి ప్రస్తావిస్తూ అందరినీ ఏకతాటి పైకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లోకి కొత్తగా వచ్చినా ఇక్కడి నాయకులు, ప్రజలు తనకు సుపరిచితులన్నారు. సమన్వయంతో వ్యవహరించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ పథకా లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి గడపకూ వెళుతున్నట్లు వెల్లడించారు. నగరంలో మురుగు వ్యవస్థ ప్రక్షాళన, శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తానన్నారు. అవినీతి రహిత పాలనే ధ్యేయంగా ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


ప్రసాద్ మృతదేహం

సామర్లకోట: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన కోరుకొండ ప్రసాద్ (35) కాకినాడ రూరల్ రాయుడుపాలెంలో గురువారం ఓ ఇంట్లో పనిచేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. భవన నిర్మాణ పనులు చేస్తున్న విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ప్రసాద్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతని మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి కూలీ మృతి


వినుకొండ టౌన్ (పల్నాడు జిల్లా): రైల్వే డబ్లింగ్ పనుల నిమిత్తం వచ్చిన వలస కూలీ మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా వినుకొండ రైల్వే స్టేషన్ సమీపాన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం తూర్పు గోదావరి జిల్లా తుని మండలం కొత్తూరు గ్రామానికి చెందిన దిడ్డి శంకర్ (40) ట్రాక్ పనుల నిమిత్తం వచ్చాడు. అయితే కాలకృత్యాలు తీర్చుకునే నిమిత్తం, రైల్వే ప్లాట్‌ఫాం చివరకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు రైలు పట్టాలపై పడి తలకు గాయమై స్పృహ కోల్పోయాడన్నారు. అదే సమయంలో అటు వైపు వస్తున్న గూడ్స్ రైలు శంకర్‌పై నుంచి వెళ్లడంతో తల, మొండెం వేరై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారాన్ని మృతుడి కుటుంబానికి తెలియచేశామని పోలీసులు వెల్లడించారు.

వ్యక్తి దుర్మరణం


సూర్యనారాయణ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద సాయిబాబా ఆలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు తెలిపారు. ఉండూరుకు చెందిన కొప్పిశెట్టి సూర్యనారాయణ(60), కుడిపూడి సత్యనారాయణ ద్విచక్రవాహనంపై కూలిపనికి వెళుతుండగా ద్రాక్షారామ వైపు వస్తున్న బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. వెనుక కూర్చుని ఉన్న సూర్యనారాయణకు తీవ్ర గాయాలు కాగా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా వారిలో ఒక కుమార్తె చిన్న వయసులోనే మృతి చెందింది. ఇద్దరు కుమార్తెలు, కుమారుడికి వివాహాలు అయ్యాయి. ఇటీవల మంజూరైన ఫించన్ ఈ నెలలో అందుకోకుండానే తనువు చాలించడంటూ కుటుంబీకులు విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ ఎస్సై తెలిపారు.

హెపటైటిస్



- వ్యాధి సోకితే ప్రాణాంతకం
- ముందస్తు వ్యాక్సిన్‌తో అడ్డుకట్ట
- నేడు ప్రపంచ హెపటైటిస్ డే

రాయవరం: సక్రమంగా లేని మన ఆహారపు అలవాట్లు ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతాయి. పలువురు మద్యం సేవిస్తూ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. అటువంటి వారు లివర్ సమస్యల బారిన పడే అవకాశముంది. ప్రపంచ వ్యాప్తంగా హెపటైటిస్–బి, హైపటైటిస్–సి వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య 354 మిలియన్ల వరకు ఉంది. ప్రతీ రోజు ప్రపంచవ్యాప్తగా 3,000 మంది మృత్యువాత పడుతున్నారు. వ్యాధి సోకిన వారిలో 90 శాతం మందికి చికిత్సలపై అవగాహన లేదు. దీంతో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 2010 జూలై 28న హెపటైటిస్ డేను నిర్వహించాలని నిర్ణయించింది. 2030 నాటికి హెపటైటిస్ లేని ప్రపంచాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా హెపటైటిస్ డేను నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలివే..

- కాలేయం వాచిపోయి మూత్రం పసుపుపచ్చగా వస్తుంది.
- కళ్లు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపుపచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చ కామెర్లు అంటారు.
- వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించి వాంతులవుతాయి.
- వ్యాధి సోకిన వారు బాగా బలహీనపడతారు. కీళ్ల నొప్పులు ఉంటాయి.
- కొంతమంది పరిస్థితి ఇంకా భయంకరంగా ఉంటుంది. పొట్ట బాగా ఉబ్బుతుంది. కాలేయం సరిగ్గా పనిచేయక మృత్యువుకు దారి తీస్తుంది.

సోకుతుందిలా..

వ్యాధి సోకిన వ్యక్తి నుంచి స్రవించే ద్రవాలు, మూత్రం, వీర్యం వ్యాధి సోకడానికి కారణమవుతుంది. సురక్షితం కాని సంభోగం, ఒకరు వాడిన ఇంజెక్షన్ సూదిని వేరొకరికి వాడడం, టాటూలు వేయించుకోవడం, ముక్కు, చెవులు కుట్టుకోవడం, ఒక రేజర్, బ్లేడ్‌ను అనేకమంది వాడడం. ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడడం, సురక్షితం కాని రక్తదానం వంటి వాటి వల్ల వ్యాధి సోకుతుంది. వైరస్ సోకిన గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు వ్యాధి సంక్రమిస్తుంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మోడల్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ల ద్వారా హెబీఎస్ఏజీ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారికి వైద్యం అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులకు ప్రత్యేక సదుపాయాలతో ప్రసూతి వైద్యం అందిస్తున్నారు. 2022–23 సంవత్సరంలో ఎనిమిది గర్భిణులకు నిర్వహించిన పరీక్షల్లో హెపటైటిస్ పాజిటివ్‌గా తేలింది. వీరిలో ఐదుగురికి మోడల్ సెంటర్లలో ప్రభుత్వ వైద్యులు పర్యవేక్షణలో డెలివరీ చేశారు. 2023–24 సంవత్సరాల్లో కొత్తగా ఐదు కేసులు నమోదయ్యాయి.

ప్రాణాంతకం

హెపటైటిస్ వ్యాధి కాలేయానికి సంబంధించినది. హెపడ్నా వైరిడియా ఫ్యామిలీ ద్వారా సోకుతుంది. వైరస్ ఒకసారి శరీరంలోకి వస్తే క్రమేపీ వాటి సంఖ్య లక్షల్లో పెరిగిపోయి లివర్‌ను దెబ్బతీస్తుంది. ఇందులో ఎ,బి,సి,డి,ఈ రకాలు ఉన్నప్పటికీ వాటిలో బీ,సీ ప్రాణాంతకంగా వైద్యులు చెబుతున్నారు. వ్యాధి సోకిన వారిలో ఏ విధమైన లక్షణాలు కన్పించకపోవడంతో వారి ద్వారా ఇతరులకు సోకుతుంది. వయసుతో సంబంధం లేకుండా అందరికీ సోకుతుంది. హెచ్‌బీఎస్ఏజీ పరీక్ష ద్వారా వ్యాధి సోకిందా? లేదా? అనేది నిర్ధారణ చేస్తారు.

వ్యాక్సిన్‌తో చెక్ పెట్టవచ్చు



హెపటైటిస్–బి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. హెపటైటిస్–సి వ్యాధికి వ్యాక్సిన్ లేదు. ముందస్తుగా గుర్తిస్తే వైద్యం చేసి నయం చేసుకోవచ్చు.

– డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, అమలాపురం

ముందు జాగ్రత్తలే మేలు



వ్యాధి వచ్చిన తర్వాత బాధపడడం కన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. ఈ వ్యాధి బారిన పడితే లివర్ క్యాన్సర్ కూడా వచ్చే అవకాశముంది. కామెర్లు వ్యాధి సోకినవారు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. శరీరంలో వైరస్ ఆరు నెలలకు మించి ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారి తీసి, కొన్నేళ్ల తర్వాత లివర్ దెబ్బతినడానికి కారణమవుతుంది. క్రానిక్ డిసీజ్ ఉన్న వారి నుంచి ఎక్కువగా ఇతరులకు వ్యాపిస్తుంది.

– డాక్టర్ కె.కార్తీక్, సివిల్ సర్జన్, ఎండీ జనరల్ మెడిసిన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

రూ.4.7లక్షల విలువైన ఐదు వాహనాలు స్వాధీనం


పట్టుబడిన మోటారు సైకిళ్లతో సీఐ మురళీకృష్ణ, సర్పవరం స్టేషన్ సిబ్బంది

కాకినాడ రూరల్: చెడు వ్యసనాలకు బానిసగా మారి సులభంగా డబ్బు సంపాదించాలని మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న కాకినాడ రూరల్ మండలం వలసపాకల గ్రామం సింహాద్రినగర్‌కు చెందిన నరాల లక్ష్మణరావును గురువారం అరెస్టు చేసినట్టు సర్పవరం సీఐ ఆకుల మురళీకృష్ణ మీడియాకు తెలియజేశారు. నిందితుడి నుంచి రూ.4.70 లక్షల విలువైన ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సర్పవరం పోలీసు స్టేషన్ పరిధిలోని డి మార్టు వద్ద రెండు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్ వద్ద రెండు, ఎస్ఆర్ఎంటీ మాల్ వద్ద ఒక మోటారు సైకిల్ చోరీ కాగా నిందితుడు నరాల లక్ష్మణరావును అతడి ఇంటి వద్ద అరెస్టు చేశామన్నారు. నిందితుడిని స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరు పరచగా 15రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌ను మెజిస్ట్రేట్ విధించారని సీఐ తెలిపారు. కేసును ఛేదించడంలో సహకరించిన హెచ్‌సీ సత్యనారాయణ, గణేష్, పీసీ వెంకటరత్నం, సతీష్‌కుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారన్నారు.

సింగిల్ విండోకు పచ్చజెండా?

- వివాహ పురోహితుల కొత్త విధానంపై నిర్ణయించే అవకాశం
- నేడు అన్నవరం దేవస్థానం పాలకవర్గ సమావేశం


అన్నవరం దేవస్థానం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం పాలకవర్గ సమావేశం శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నారు. చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో ట్రస్ట్ బోర్డు సభ్యులతో బాటు ఈఓ చంద్రశేఖర్ అజాద్, ఇతర అధికారులు పాల్గొంటారు. ఈసారి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

వివాహ పురోహితుల వేలం రద్దుకు ఆమోదం

ప్రధానంగా ఇటీవల కాలంలో వివాదాస్పదమైన వివాహ పురోహితుల సంభావన హక్కు వేలం పాటను రద్దు చేస్తూ దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ప్రతిపాదించే తీర్మానానికి పాలకమండలి ఆమోదం తెలపనుంది. దాని స్థానంలో కొత్త విధానంపై చర్చించనున్నారు. సింగిల్ విండో పద్ధతిని అమలు చేస్తూ అటు వివాహాలు చేయించే పురోహితులు, పెళ్లి బృందాల ఇంటి పురోహితులు, దేవస్థానంలో పనిచేస్తున్న వ్రత పురోహితులకు వివాహాలు చేయించే అవకాశం కల్పించనున్నారు. ఇందుకోసం వివాహానికి విద్యుత్, క్లీనింగ్ చార్జీల కోసం కొంత మొత్తం పెళ్లిబృందాలు చెల్లించేలా నిర్ణయించనున్నట్లు సమాచారం.

- పురోహితుల కొత్త విధానానికి సంబంధించిన విధి విధానాలు తెలిపే బోర్డులను దేవస్థానంలో పలుచోట్ల ఏర్పాటు చేయనున్నారు.
- వచ్చే నెల 18వ తేదీన సత్య విదియ (సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవం) సందర్భంగా చేయవల్సిన ఏర్పాట్లపై కూడా చర్చించనున్నారు.
- ప్రతీ గురువారం మధ్యాహ్నం వరకు 'సత్యదేవుని నిజరూపు' పేరుతో ఎటువంటి అలంకరణ లేని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి శిలామూర్తులను భక్తులు తిలకించే విధంగా ఏర్పాటు చేసే కొత్త విధానంపై ట్రస్ట్‌బోర్డులో చర్చించనున్నారు.
- జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయంలో శిలా మూర్తులకు బదులు తాత్కాలికంగా సిమెంట్ విగ్రహాలు ప్రతిష్ఠించి భక్తులకు దర్శనం కలిగించేలా తీసుకున్న నిర్ణయంపై చర్చించనున్నారు.
- ఉత్తరాయణంలో అంటే వచ్చే జనవరి అనంతరం ఆలయంలో శిలామూర్తులను ప్రతిష్ఠించి కుంభాభిషేకం నిర్వహించే అంశంపై కూడా చర్చించనున్నారు. ఆలయం సమీపంలో వంటశాల నిర్మించి త్రికాల నివేదనలు తయారు చేసే విషయమై చర్చించనున్నారు.
- వ్రత మంటపాలలో వృద్ధులు, వికలాంగులు వ్రతాలాచరించే సమయంలో ఎక్కువ సేపు నేల మీద కూర్చోలేకపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్రత మంటపాలలో ఒక వరుస టేబుల్స్, బెంచీలు ఏర్పాటు చేసే విషయమై చర్చించనున్నారు.
- సత్యదేవుని చిత్రం ముద్రించిన శాలువాల కొనుగోలు, భక్తులకు సత్యదేవుని కండువాలు విక్రయించే విషయమై కూడా చర్చించనున్నారు.
- దేవస్థానంలో పలు నిర్మాణ పథకాలకు టెండర్ల ఆమోదంపై కూడా చర్చించనున్నారు.

బయోడీజిల్ విక్రయాలపై కేసు

5,800 లీటర్ల సరుకు సీజ్


దాడిలో పాల్గొన్న పౌరసరఫరాల అధికారులు

కాకినాడ రూరల్: ఏడీబీ రోడ్డును ఆనుకుని కాకినాడ రూరల్ వాకలపూడి గ్రామ పరిధిలో భారత్ పెట్రోలియం బంక్ ఎదురుగా అనుమతి లేకుండా బయో డీజిల్ విక్రయాలు జరుపడంతో పౌర సరఫరాల శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి బయో డీజిల్‌ను తీసుకువచ్చి అక్రమ నిల్వ ఉంచి బోట్లకు విక్రయాలు జరుపుతున్నట్టు సమాచారం అందడంతో పౌర సరఫరాలు అధికారులు ఏఎస్ఓ ప్రసన్నలక్ష్మీదేవి, ఎంఎస్ఓలు మమత, ఆనంద్, సిబ్బంది బుధవారం దాడి చేసి అర్ధరాత్రి వరకు రికార్డులు తనిఖీ చేశారు. 5,800 లీటర్ల సరుకు సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఓ ప్రసన్న లక్ష్మీదేవి మాట్లాడుతూ వాకలపూడిలోని సీమాన్ లాబొరేటరీస్‌లో జాలీమ్ శామ్రాయ్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా బయోడీజిల్ విక్రయిస్తుండడంతో కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బయో డీజిల్‌ను వశిష్ట ఫ్యూయల్ వద్ద భద్రత నిమిత్తం గురువారం అప్పగించామన్నారు. ట్యాంకర్‌తో ఉన్న వాహనాన్ని తిమ్మాపురం పోలీసులకు అప్పగించామన్నారు. సరకును హైదరాబాద్, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తెచ్చినట్టు నిందితుడు తెలిపాడన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిలోని సెల్‌ఫోన్, ఇత్తడి సామానులు చోరీచేసిన రహమత్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అమీర్‌ను గురువారం బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. లాలాచెరువు బత్తిననగర్‌కు చెందిన సరిదే పెద్దింట్ల, భర్తతో కలిసి పాతఇనుము వ్యాపారం నిర్వహిస్తారు. బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి షాపుకు వచ్చి తిరిగి రాత్రి ఇంటికి వెళ్లారు. తలుపులు తీసి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పెద్దింట్ల ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై మోహనరావు తెలిపారు.

అట్టహాసంగా క్లస్టర్ గేమ్స్


జ్యోతి వెలిగించి క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రామిరెడ్డి


నవోదయలో హోరాహోరీగా జరుగుతున్న క్రీడాపోటీలు

పెద్దాపురం నవోదయలో ప్రారంభం

పెద్దాపురం: ప్రతీ విద్యార్థికి క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని పెద్దాపురం ఐటీబీ బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ ఎస్.నరేంద్రనాథ్, పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి అన్నారు. స్థానిక నవోదయ విద్యాలయలో రెండు రోజుల పాటు నిర్వహించే క్లస్టర్ స్థాయి బాల్‌గేమ్స్ పోటీలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాలయ పీఈటి ఆర్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన క్రీడా పోటీలనుద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని కనపర్చాలన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలుత జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. అనంతరం క్లస్టర్ లెవల్ బాల్ గేమ్స్ (వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్) క్రీడా పోటీలు నిర్వహించగా నవోదయ తూర్పుగోదావరి 1,2తో పాటు విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, పశ్చిమ గోదావరి, గుంటూరు, యానాం నవోదయ కేంద్రాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

'వందేభారత్'కు సామర్లకోటలో హాల్ట్

రైల్వే మంత్రికి ఎంపీ గీత విజ్ఞప్తి


రైల్వే మంత్రి అశ్వనివైష్ణవ్‌కు వినతిపత్రమిస్తున్న ఎంపీ గీత

సాక్షిప్రతినిధి, కాకినాడ: వందేభారత్ రైలుకు సామర్లకోట జంక్షన్‌లో హాల్ట్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనివైష్ణవ్‌కు కాకినాడ ఎంపీ వంగా గీత విజ్ఞప్తి చేశారు.గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి జిల్లాలో పలు పెండింగ్ అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రాజమహేంద్రవరం, విశాఖపట్నం మధ్య సామర్లకోటలో వందేభారత్‌కు హాల్ట్ ఇప్పిస్తే ప్రయాణికుల సంఖ్య ఇంతకు రెట్టింపు అవుతుందన్నారు. ప్రయాణికుల అవసరాల దృష్ట్యా ఈ హాల్ట్ ఇప్పించాలని కోరారు. సామర్లకోట రైల్వే జంక్షన్ మీదుగా నడిచే ముఖ్యమైన రైళ్లకు తుని, అన్నవరం, గొల్లప్రోలు, పిఠాపురం, రావికంపాడులో స్టాప్ ఇవ్వాలని ఈ మేరకు లేఖను కేంద్ర మంత్రికి అందజేశారు. ఫాస్ట్ పాసింజర్ రైలు డౌన్‌లో మాత్రమే ఆపుతూ, అప్‌లో ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇటీవల రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం మంజూరు చేసిన రూ.40 కోట్లు విడుదల చేసి పనులు త్వరితగతిన టెండర్లు పిలిచి పనులు పూర్తి అయ్యేటట్టు చూడాలన్నారు. రైళ్లలో సీనియర్ సిటిజన్స్, జర్నలిస్టులకు రాయితీలు కల్పించాలని ఎంపీ కోరారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో మహిళల కోసం జనరల్ బోగీలు పెంచాలని, కోవిడ్‌లో నిలిపివేసిన పాసింజర్ రైళ్లు పునరుద్ధరించాలన్నారు. అన్నవరం నుంచి కాకినాడ సెజ్ వరకు ఏర్పాటు చేస్తోన్న పోర్టు రైల్వే లైన్ నిర్మాణాన్ని కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్ వరకు విస్తరించాలని గీత విజ్ఞప్తి చేశారు. కాకినాడ నగరం నుంచి వ్యాపార, వాణిజ్య వర్గాలకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుందన్నారు.

ముగిసిన వర్క్‌షాపు


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ, డీపీపీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్, ఆప్‌స్కిల్స్ సంస్థ సహకారంతో డేటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ –లెవరేజింగ్ పైథాన్ టెక్నాలజీ ప్రాక్టికల్ అప్రోచ్ అంశంపై నిర్వహిస్తున్న వర్క్‌షాపు 3వ రోజు గురువారం ముగిసింది. జేఎన్‌టీయూ హైదరాబాద్ వర్సిటీ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ అయ్యంకి మురళీకృష్ణ పవర్ ఆఫ్ డిజైన్ థింకింగ్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అంశంపై ప్రసంగించారు. మేధాశక్తితో ఆలోచించడం ద్వారా వినూత్నమైన పరిశోధనలు, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు సులువుగా చేపట్టవచ్చన్నారు. మెషిన్ లెర్నింగ్ కాలక్రమేణా అన్వేషణాత్మక పరిశోధన నిర్వహిస్తుందన్నారు. అనంతరం వర్సిటీ డిజైన్ ఇన్నొవేషన్ సెంటర్ డైరెక్టర్ గోపాలకృష్ణ, డీపీపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వర్క్‌షాపులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత, ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పరిశోధనలో ఫెలోషిప్ పొందిన అంధ విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): యూజీసీ నిర్వహించిన నెట్ పరీక్షలో ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ పూర్తి చేసిన దివ్యాంగ విద్యార్థి పల్లాపు పవన్‌కుమార్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ను సాధించాడు. ఈ మేరకు వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు గురువారం తెలిపారు. దివ్యాంగుల కమిటీ నేతృత్వంలో గణిత అధ్యాపకులు శ్రీరామమూర్తి, ఆంగ్ల అధ్యాపకులు శ్రీ శైలశాస్త్రి పర్యవేక్షణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేశాక ఉన్నత ఉద్యోగాలలో, పోటీ పరీక్షల్లో పరిశోధనల్లో ప్రతిభ కనబరిచేలా అధ్యాపకులు కృషి చేస్తున్నారన్నారు. అంధ విద్యార్థి పవన్‌కుమార్ మాట్లాడుతూ తెలుగులో పరిశోధన చేస్తూ డీఎల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని పొందడమే లక్ష్యంగా ముందుకు వెళతానన్నారు. తెలుగు శాఖాధిపతులు డాక్టర్ ఎం.సుధామయి, అకడమిక్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఎంఆర్ గౌతమ్ పాల్గొన్నారు.